


'ప్చ్... అత్తయ్య రాలేదు' ఇలా అనుకోవడం ఎన్నిసార్లో గుర్తులేదు మాధురికి.

'ఇన్విటేషన్ పంపారో లేదో నాన్న? పంపానని చెప్పారే!' తండ్రి మాటపై కొద్దిగా సంశయం కలిగినా, తండ్రిని అనుమానించలేదు మాధురి. 'ఎలా? ఏం చేయాలి?' మాధురి మనసంతా ఆలోచనల ముసురే. తల విదిలించింది.

"కదలకమ్మా జడను పూర్తి చేయనీ..." మాధురికి డాన్స్‌మేకప్

సి. ఉమాదేవి

# నాట్య బంధం

చేసే బ్యూటీషియన్ రోజీ మాధురిని ముచ్చటగా బుజ్జగించింది.

"సరే" నంటూ బుద్ధిగా కూర్చుంది మాధురి.

"జడకు కనకాంబరాలు చుట్టెయ్యనా లేక మల్లెలు కూడా కలపనా?" రోజీ ప్రశ్నించినా మాధురి ఆ ప్రశ్న విననట్లే మళ్లీ మేనత్త 'స్వప్న సుందరి' గురించే ఆలోచిస్తోంది.

'స్వప్న సుందరి! ఎంత చక్కటి పేరు! అత్తయ్యకు కనకాంబరాలంటే చాలా ఇష్టమట. చామనఛాయైనా కళగల ముఖమట. మల్లెలు వాడితే నలుపు తిరుగుతాయని జడకు కనకాంబరాలు తప్ప వేరొకటి ఒప్పుకునేది కాదట. బుట్ట కనకాంబరాలు కళ్లకింపుగా కనబడితేగానీ నర్తించాలని ఉత్సాహం చూపేది కాదట' మాధురి తలపులన్నీ అత్తపైనే.


"మాధురీ! వాట్సరాంగ్? కనకాంబరాల మాలను మాధురి కన్నుల ముందు ఊపింది రోజీ.

"మల్లెలొద్దు నాకూ కనకాంబరాలే".

"నాకూ అంటే...? నీవొక్క దానివే కదా అరంగేట్రం చేసేది?" సందేహంగా అడిగింది రోజీ.

"ఆ... ఆ... ఏం లేదు, సరేలే ఇక నగలు వేసేసుకుంటా. నాన్న వచ్చే టైమ్ కూడా అయింది" త్వరపడ సాగింది మాధురి.

"నువ్వేకదమ్మా...



ఊహాలోకంలో విహరిస్తూ 'ఆ... ఊ" అంటున్నావు"

రోజీ మాటలకు మాధురి అందంగా నవ్వింది.

ఎదుటి వ్యక్తికి సమాధానం చెప్పకూడదనుకున్నప్పుడో లేదా మనసులోనే రహస్యం దాచుకోవాలనుకున్నప్పుడో అపద్ధర్మంగా కాపాడే నవ్వే ఆ నవ్వు.

"మధూ కనకాంబరాలు సరిపోయాయా?" మాధురి తండ్రి చంద్రశేఖరం కూతురిని కన్నార్పకుండా చూస్తూ అడిగాడు.

చంద్రశేఖరం రాగానే తప్పుకుని, బయటకు వెళ్లి, అక్కడ ఉన్న కుర్చీలో కూర్చుంది రోజీ.

చంద్రశేఖరం చెల్లెలు 'స్వప్న సుందరి' అరంగేట్రం నాడు ఆమెకు మేకప్ చేయాలని రమ్మని కబురు పెట్టాడు.

"మా చెల్లెమ్మకు అరంగేట్రం. మీరెలా మేకప్ వేస్తారో తెలియదు కానీ చివరి ఐటమ్ దాకా మీరు చేసిన మేకప్ చెరిగిపోకూడదు" అన్నాడు.

"అలాగే సార్" అని వినయంగా తలూపిన రోజీ - ప్రోగ్రామ్ మధ్యలో సవరం సరిగాలేక జడ వదులుగా ఊడినట్లుంటే అతనికంత కోపం ఎందుకు వచ్చిందోనని నివ్వెరపోయింది.


ఆ రోజుల్లో స్వప్నసుందరి నృత్యం ప్రేక్షకులకు రససిద్ధిని కలిగించడమేకాదు, ఒక మధురానుభూతిని కూడా మిగిల్చేది. హావభావ ప్రకటన, రసపోషణ అటుంచి ఆమె నృత్యంలో 'ఈజ్' వల్ల అలాఅలా ఓ పిల్ల తెమ్మెర మానవ కాంతలా రూపుదాల్చినట్లు, తరంగాలు పదలయలై నర్తించినట్లు భ్రమ కలిగేది. తిల్లానా, అన్నమయ్య కీర్తనలు కాక తనదైన ప్రత్యేక శైలిలో భామాకలాపం ప్రదర్శించేది. పొడవైన జడలేనిదే భామాకలాపం రక్తి కట్టదు. చంద్రశేఖరానికి కోపం వచ్చిందంటే రాదూమరి? రోజీకి ఆ రోజులు గుర్తుకు వచ్చాయి. ఈ రోజుల్లో అంత శ్రద్ధ, అంకితభావం కొరవడ్డాయే అని మనసులోనే బాధపడుతోంది రోజీ.

కూతురి తలపై పూలు చెదరకుండా ముద్దు పెట్టాడు చంద్రశేఖరం. "నాన్నా..." అంటూ కాళ్లకు వంగి నమస్కరించి, తరువాత తల్లి ఫోటోకి పూలమాల వేసి నమస్కరించింది మాధురి.

* * *

ఆహూతులందరూ ఒక్కొక్కరే వచ్చి చేరసాగారు. కళావేదిక నిత్యకళ్యాణం, పచ్చతోరణంలా కళా, సాహిత్య సేవలకు అంకితమై, విద్యుద్దీపాల అలంకరణతో సోయగాలు వెదజల్లుతోంది. ప్రేక్షకులలో తానూ ఒకడైనాడు చంద్రశేఖరం. అతని కళ్లు అదేపనిగా ద్వారాన్నే ఆశ్రయిస్తున్నాయి. 'తాను పంపిన ఆహ్వానం అందలేదేమో? ఎందుకు అందదు? ముందుగానే పంపానే... మరి ఎందుకీ మౌనం? ఏమిటీ పట్టుదల? తల్లి, తండ్రీ లేని తను, చెల్లెలు ఒకరికొకరు తోడైనిలిచారు. అగమ్యగోచరంగా ఉన్న బ్రతుకుబాటలో సూర్యనారాయణ మాస్టారు పెద్దమనసు చేసుకుని తమని అక్కున చేర్చుకున్నారు. వాళ్ల అబ్బాయి రమణతో తాను చదువులో పోటీ. వాళ్ల అమ్మాయి మృదుల, చెల్లెలు స్వప్న నృత్యంలో ఒకరికొకరు పోటీ!

మనసంతా ప్రేమ పాదు చేసి పెంచుకున్న చెల్లెలు 'నీ అవసరం తీరింది' అని చెంపపై ఛెళ్లునకొట్టి మరీ చెప్పినట్లనిపించింది. నర్తించే రంగస్థలం పదిమంది పరిచయమయ్యే చోటు. మన పరిధిలో మనం ఉండాలి. ఇతరుల జీవి




తాలలో మనం తొంగి చూడనప్పుడు ఇతరులు కూడా మన జీవితంలో ప్రవేశించకూడదు అన్నది చంద్రశేఖరం సిద్ధాంతం. అయితే స్వప్న సుందరి దీనికి పూర్తిగా విరుద్ధం. గలగలపారే సెలయేరులా, ఎవరికైనా పరిచయం అయితే చాలు... ఏ మొహమాటం, సంకోచం లేకుండా మాటలు కలబోసుకుంటుంది. అదిగో అప్పుడు అలా పరిచయమయాడు జోసఫ్. లావు, ఎత్తుల మధ్య సమతుల్యం, తెల్లని మేని ఛాయ వీటన్నిటినీ మించి వయసుకు మించిన పరిణితి.

'డాన్స్ ద ఇండియన్ వే' అనే శీర్షికతో పత్రికలకు 'ఆర్టికల్స్' వ్రాస్తుండేవాడు. దానిలో భాగంగా నృత్యకళాకారులను ఇంటర్వ్యూ కూడా చేసేవాడు. ఆ నేపథ్యంలో స్వప్న పరిచయం అతనికొక స్వప్నంగానే మిగిలిపోకూడదనిపించింది.

'ప్రేమ' – రెండక్షరాల ఈ నిషా నిర్వచనానికి అతీతం. ప్రేమ పుట్టుక ఎలా జరుగుతుందో ఊహకందదు. కానీ ఈ ప్రేమ మనసునే కాదు... మనిషినీ శాసిస్తుంది ఒక్కొక్కసారి.

మాస్టారి సహకారంతో చంద్రశేఖరం అంచెలంచెలుగా పైకెదిగి, స్వంత వ్యాపారం ఏర్పరచుకుని, నలుగురికి భృతి కల్పించే స్థితికి చేరుకున్నాడు. స్వప్న అతనికి ఆరోప్రాణం. చెల్లెలు కోరడం ఆలస్యం – అది ఇది అని తేడా లేకుండా కోరినవి కోరినట్లు సమకూర్చేవాడు. అయితే జోసఫ్‌ని జీవిత సహచరుడిగా స్వప్న కోరినప్పుడు అతని కోపాగ్ని బడబాగ్ని రూపం దాల్చి, జోసఫ్‌ని మాటలతో దహించివేసింది. చిన్నబోయిన జోసఫ్ వెనుదిరుగుతూంటే 'నేనూ వస్తున్నా' అని అతని చేయందుకుని బయటకు నడిచింది స్వప్న. తల్లిదండ్రులు లేని లోటు తెలియకుండా పెంచిన అన్న ఆలనాపాలనా చేయగలిగాడేకానీ మనసుకి స్వాంతన చేకూర్చలేకపోయాడు. చెల్లెలికి అక్షయపాత్రలాంటి జీవితం చంద్రశేఖరం ఆశయం. అడపాదడపా వచ్చిన సంబంధాలను తన చెల్లెలికి సరితూగవని తోసిపుచ్చాడు. ఈలోగా తాను కోరుకున్నవా

నికి చేయందించింది స్వప్న. కానీ పర్యవసానం మాత్రం పుటుక్కున తెగినదారంలా అన్నాచెల్లెళ్ల ను వేరుచేసింది. అయినా స్వప్న బాగోగులు పరోక్షంగా తెలుసుకుంటూనే ఉన్నాడు చంద్ర శేఖరం. నగరవాతావరణానికి దూరంగా చల్లని పల్లె ఒడి చేరి పిల్లలకు నృత్యం నేర్పిస్తూ, జోసఫ్ కు తోడూనీడగా నిలిచింది. ఆ పల్లె నుంచి వచ్చినవాళ్లు మొదట్లో చంద్రశేఖరానికి అవీఇవీ వార్తలు చేరవేసేవారు. కానీ ఆ తరువాత వార్త లు తగ్గసాగాయి. జోసఫ్ పేరు వింటూనే అం తెత్తు ఎగురుతాడు చంద్రశేఖరం. తన చెల్లెలు భవిష్యత్ నాశనం చేసినవాడంటూ చిందు లేస్తాడు. ఇతనితో మనకు లిటిగేషనెందుకు? స్వప్న తల్లి చల్లగా ఉండాలి. అసలే ఆరోగ్యం తరిగి విశ్రాంతి లేని జీవితం గడుపుతోంది అని చంద్రశేఖరాన్ని తప్పించుకునేవారు. స్వప్న పల్లెవాసులందరికి ఆత్మీయురాలు. పల్లెకు ఆమె తోబుట్టువు. వారానికి రెండురోజులు డాన్స్‌పే రిట పిల్లలందరికీ స్వప్నే భోజనం పెడుతుంది. ఈ మధ్య ఆసక్తి తగ్గిందో, ఆరోగ్యమే కుంటు పడిందో ఒక్క ఆదివారం మినహా మరో రోజు డాన్స్ నేర్పదు. దీనికికారణం అంతుబట్టక, ఆమెను అడిగే ధైర్యం లేక సర్దుకుపోతారంద రూ. అది తన అనారోగ్యమని స్వప్నకు తెలుసు.

'స్వప్నా! మై డియర్ సిస్టర్! నీ పంతం, పట్టుదల చిన్నప్పటి నుంచీ నేను పెంచి పోషిం చినవే! అవే నా మీద పాశుపతాస్త్రాలుగా ప్రయో గిస్తున్నావ్. ఇన్నేండ్లుగా నీ రాక కోసం వేచి ఉన్నది నేను కాదు నా బిడ్డ. నా కూతురికి తల్లి లేదు. నాకు తెలుసు. నేను తీర్చలేని లోటది. అనురాగ స్పర్శలేక నాలోనే అమ్మను వెతు క్కుంటూ తల్లడిల్లుతోంది నీ మేనకోడలు. నీ పేరు చెప్పినా, నీ ఫొటో చూపినా, నీ నృత్యభం గిమలను చూసి నూతనోత్తేజంతో డాన్స్ క్లాస్‌కు వెళ్లి, పాదాలు ఇక నర్తించలేమని మొరాయించే దాకా, డాన్స్ ప్రాక్టీస్ చేసి 'స్వప్నత్తా' నిన్ను నేను గెలుస్తాను' అని సవాల్ చేస్తోంది. మరి నీ మేనకోడలి నృత్యం చూడాలనిపించలేదా? ఏ అనురాగ స్పర్శ నీకు కొరవడిందనుకు న్నావో, అదే నిజమని భావిస్తోంది నీ మేన కోడలు. 'నీకెప్పుడూ ఆ బిజినెస్ గొడవలే నాన్నా. నాకు తోడు లేక అల్లాడుతున్నాను. నౌకర్లు తప్ప మరో ప్రాణి కనపడదు. అను భూతులు, అనుభవాలూ పంచుకునేటందుకు, పెంచుకునేటందుకూ సరైన తోడు కావాలి. పెంచిన తండ్రి, పెంచిన అన్న గొడుగులా నీడ నివ్వగలరేగానీ మనసులోని భావాలు పంచు కునే మమకారమెక్కడ? అని నన్ను నిందిస్తోం ది. నీ రాక నాకు కాక నా కూతురికి ఎంత ముఖ్యమో నేను నీకు చెప్పలేను. నీకై నీవు వచ్చి నా 'ఇగో'ని తృప్తిపరచలేవు.


చంద్రశేఖరం మనసు బాధతో మూలుగు తోంది.

ప్రోగ్రామ్ మంగళంతో ముగుస్తోంది. అయినా స్వప్న జాడలేదు. నిరుత్సాహంగా ఇం టికి బయలుదేరారు తండ్రీ కూతుళ్లు. ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలుతోంది.

తానే నిశ్శబ్దాన్ని ఛీలుస్తూ అడిగింది మాధురి.

"నాన్నా, అత్తయ్య ఎందుకు రాలేదు?" అని. ఇది చాలా సూటి ప్రశ్న. జవాబు చెప్పడం కష్టమే. స్టీరింగ్ అదుపు తప్పినట్లయి కంట్రోల్ చేసాడు చంద్రశేఖరం.

"కారణం ఒకటేనమ్మా. మా మధ్య బంధం కన్నా పంతం ఎక్కువగా బిగుసుకుంది. ఇక ఎందుకు వస్తుందమ్మా మీ అత్తయ్య? ఒకసారి ఆరోగ్యం బాగాలేదని విన్నాను. రమ్మని కబురు




పెట్టాను".

'భార్యను డాక్టర్‌కి చూపించలేని అశక్తుడు కాదు నా భర్త' అని చెప్పమందట.

ఐదు నిమిషాలు మాధురి మౌనంగా ఉండి పోయింది. ఖచ్చితమైన నిర్ణయానికే ఈ నిశ్శబ్ద తుఫాను.

"నేనే వెళ్తాను నాన్నా" దృఢంగా పలికింది మాధురి.

చంద్రశేఖరం గుండెల్లో రాయి పడింది. కాలేజీ దగ్గర వదలడం, సాయంత్రం మళ్లీ పికప్. ఇది చాలక కూతురిని డాన్స్ క్లాస్‌కు తీసుకుని వెళ్లి మళ్లీ ఇంటికి చేర్చడం. రాత్రయ్యే సరికి 'హమ్మయ్య' ఈ రోజు కంటికి రెప్పలా కాపాడుకున్నానన్న తృప్తితో నిద్రపోవడం... ఇదీ చంద్రశేఖరం దినచర్య.

'ఇప్పుడు ఒంటరిగా బయలుదేరుతానం టోంది ఎలా?... ఎలా?' చంద్రశేఖరంలో దిగులు ఉప్పెనలా కమ్ముకుంటోంది.

పట్టుదలకు మారుపేరు మాధురి. మేనత్త పోలిక, మేనత్త గుణాలూ పుణికిపుచ్చుకున్నది.

"కానీ..." ఏదో సంశయంతో అడ్డుచెప్పబో తున్న తండ్రిని చేతి సైగతోనే వారించింది, అడ్డువేయవద్దన్నట్లు.

ఇంటికి రావడం ఆలస్యం - నగలు, డ్రస్ ఎక్కడివక్కడ సర్దేసి మేకప్ క్లీన్ చేసుకుంది మాధురి.

"ఈ రోజే వెళ్లాలి" ఇక నా నిర్ణయం మార దన్నట్లు మరోసారి పట్టుదలగా అంది మాధురి.

స్వప్న సుందరి ఉండే పల్లెకు ప్రతి గంటకూ ఒక బస్సుపోతుంది. కానీ ప్రయాణం హాయిగా ఉండదు. ఆహూతుల చప్పట్లు ఇంకా చెవులలో మ్రోగుతూనే ఉన్నాయి. 'డాన్స్ ప్రోగ్రామ్ తరువాత బస్సు ప్రయాణం కష్టం' అనుకున్న చంద్రశేఖరం రైటు టికెట్టు తెచ్చిన నౌకరుని ఇంట్లోనే ఉండమని, తానే స్వయంగా వెళ్లి మాధురిని రైలెక్కించాడు. మాధురి భోజనం చేయలేదని

బ్రెడ్, సాండ్‌విచ్ ప్యాకెట్టు అందించాడు. అప్పు డనిపించింది మాధురికి... 'ఆకలి మాటే మరి చిన తనను నాన్న ఎంత ఆప్యాయంగా చూసు కుంటున్నాడు' అని.

"మరి నీకు నాన్నా!" ఆతృతగా అడిగింది మాధురి.

"నాకూ డిటోయే" నవ్వాడు చంద్రశేఖరం.

స్వప్న సుందరి ఉండే మునిపల్లెకు వెళ్ల వలసిన దారి, అక్కడ చెల్లెలు ఉండే స్థలం, కనకాంబరాల తోటతో సహా అన్నీ వివరంగా చెప్పాడు చంద్రశేఖరం. రైలు కదులుతోంది. చిరునవ్వుతో వీడ్కోలు పలికాడు.

* * *

కదులుతున్న రైల్లో మాధురి మనసు మన సులో లేదు. మనసు పయనమెటో! రైలు లయ బద్ధంగా పరుగులు తీస్తోంది. అలసటగా కళ్లు మూసుకుంది మాధురి.

"ఎక్కడిదాకా అమ్మా" ఎవరో అడుగుతు న్నారు.

"మునిపల్లె" ముక్తసరిగా చెప్పింది మాధురి.

"నేనూ అక్కడికే" ఆ అపరిచిత స్త్రీ చెప్తోం ది. 'ఈమెను ఎక్కడో చూసాను' అనుకుంది మాధురి.

చేతులకు, పాదాలకు వేసిన రంగు చెదిరిం ది. గాలికెగురుతున్న ముంగురులలో అక్కడ క్కడా కనకాంబరాలు. ఇదీ మాధురి పరిస్థితి.

"నీవు డాన్సర్‌వా అమ్మా?"

'నా వేషం నన్ను పట్టించేసినట్లుంది' అను కుంటూ "అవునండీ" అంది మాధురి. మాధు రికి మాటలు పొడిగించాలని లేదు. అంతా అత్తమీద ధ్యాసే!

"ఎంతవరకూ నేర్చుకున్నావు?"

"ఏమిటి ఈ ప్రశ్నలు" మనసులో విసు క్కుని అయినా ఓర్పుగా

"ఎంతవరకూ అని కాదు... ఓ పదేండ్లు నేర్చుకున్నాను" ఆత్మవిశ్వాసం పలికింది.

"నాట్యానికి హావభావాలు ప్రధానం"

అవునన్నట్టుగా తలాడించింది మాధురి.

"రసపోషణ మనమెంత పోషిస్తామో, ప్రేక్ష కుడంత రససిద్ధి పొందుతాడు.

ఆమె చెపుతూనే ఉంది. లయవిన్యాసము, ముద్రలు, నాట్యలాస్యము గురించి వివరంగా విశ్లేషిస్తోంది.

"నాకు డాన్స్ థియరీ పెద్దగా తెలియదండీ" సిగ్గుపడుతూ చెప్పింది మాధురి.

"డాన్స్‌లోనే ముద్రలు వివరిస్తారు అభ్యాస మప్పుడు చేతివేళ్లు నొప్పిపుట్టేవరకూ ముద్రలు పట్టాల్సిందే.

అయినా మా గురించే కదా" గురువు పట్ల భక్తిభావంతో చెప్పింది మాధురి.


"మీ గురువు?" ప్రశ్నార్థకంగా చూసిం దామె.

"మా గురువు భావనారాయణగారు" అని మాధురి అంటూండగానే ఆమె ముఖంలో సంతోషం వెల్లివిరిసింది.

"గుడ్. భావనారాయణ కూడా డాన్స్ నేర్పి స్తున్నాడా? సినిమాలలో చేరిపోతాను డాన్స్ డైరెక్టర్‌గా అంటుండేవాడు. పోనీలే సంప్ర దాయ వృత్తినే చేస్తున్నాడు".

ఆమె వంకే తెల్లబోయి చూస్తున్న మాధురి తో "వారి తండ్రికి నేను శిష్యురాలినిలే... ఒక ప్పుడు" ఆమె జ్ఞాపకాల పుటలు తిరగేస్తోంది.

"మీకు డాన్స్ వచ్చా?" అంతవరకూ అంటీ




ముట్టనట్లు మాట్లాడిన మాధురి ఆసక్తిగా ముందుకు వంగింది.

"అవును తల్లీ. నాకు శాస్త్రీయనృత్యమంటే ఎనలేని ప్రీతి. నాట్యశాస్త్రాన్ని ఔపోసనపట్టాలన్న దాహార్తి! అందుకే నాట్యరీతులు, భారతీయత అనే అంశంపై పి.హెచ్‌డి. చేస్తున్నతనితో సాహచర్యానికి సిద్ధపడ్డాను, అతడు అన్యమతస్థుడైనా. కాని ఏం లాభం? నేను చాలా పోగొట్టుకున్నాను" దుఃఖంతో ఆవిడ ముక్కు ఎర్రబారుతోంది.

"ఎందుకో బాధపడుతున్నారు, ఏమయింది?" మాధురి ఆసక్తిగా అడిగింది. ఆమె తెలివిగా టాపిక్ మార్చింది. వివిధ నాట్యరీతుల గురించి ఉత్సాహభరితంగా వినదగినట్లు వివరిస్తూంటే ముగ్ధురాలయింది మాధురి. ఆమె కంఠం వీణ మీటినట్లు మనసుని నిద్రపుచ్చుతోంది. కన్నులు అరమోడ్పులవుతున్నాయి మాధురికి.

* * *

"కాఫీ... కాఫీ" కాఫీ అమ్మే కుర్రాడి కేకకు ఉలిక్కిపడి లేచి సర్దుకుని కూర్చుంది మాధురి. అటూ ఇటూ చూసింది.

"మునిపల్లె" పచ్చటి పసుపు అక్షరాలతో స్పష్టంగా కనబడుతోంది.

'హమ్మో' అనుకుంటూ గబగబా సూట్‌కేస్ తీసుకుని రైలు దిగింది. తనతో అంతవరకూ నాట్యం గురించి పదేపదే చెప్పిన స్త్రీ కోసం అటూ ఇటూ చూడబోయి నాలుక కరచుకుంది కట్టిపడేసిన కలను తలచుకుని. ఏదైనా జట్కా, రిక్షా లాంటిది దొరుకుతుందేమోనని స్టేషను బయటకు నడిచింది. స్టేషను వేపు మరోసారి చూసింది. 'మునిపల్లే' సందేహం లేదు. తాను సందర్శించబోయే స్వప్నసుందరి - మునిపల్లెలో మేనత్తను తలచుకుంది ప్రేమగా. అదృష్టవశాత్తు మాధురికి జట్కా ఖాళీగా కనిపించింది. జట్కాలో నిద్రపోతున్న జట్కా తాతను పిలిచి, 'స్వప్నసుందరి'గారింటికి పోనివ్వమంది.

"ఎవరు తల్లీ నువ్వు?" అడిగాడు జట్కా తాత

"ఆమె మేనకోడలిని" గర్వంగా చెప్పింది మాధురి.

"అనుకున్నా... అప్పుడే అనుకున్నా... ఆ చిన్న నుదురు, ఆ కళ్లు చూసి సుందరమ్మకు దగ్గరవారేనని" ఆనందం, దుఃఖం కలబోసి మాట్లాడుతున్నాడు జట్కా తాత.

"అదిగోమ్మా... ఆ ఇల్లే" దూరం నుంచే చూపించాడు జట్కా తాత.

జట్కా దిగి ఒక్క ఉదుటున తలుపు తీసిన అత్తను వాటేసుకోవాలనుకున్న మాధురి చప్పున వంగి 'అత్తయ్యా' అంటూ వంగి పాదాలంటి నమస్కరించింది. అత్తయ్య ముఖంలోకి తరచి చూచింది. అస్పష్ట స్వప్నంలో నుంచి ప్రత్యక్ష మైన స్వప్నసుందరి... తాను చూసిన ఫొటో లలో కన్నా చాలా సన్నగా, నీరసంగా కనిపించింది.

"నేనెవరో తెలుసా?' ఆర్తిగా అడిగింది మాధురి.

'అత్తయ్యా అంటూ వచ్చావు. నువ్వు నా మేనకోడలివి కాదా?' ఆప్యాయంగా మాధురి బుగ్గపై ముద్దుపెట్టింది స్వప్నసుందరి. ఇద్దరూ కనకాంబరాల తోటంతా కలియదిరిగారు. స్వప్నసుందరి కనకాంబరాలు కోసి మాధురి దోసిట పోసింది.

"నీకు మాల కట్టడం వచ్చా?" నవ్వుతూ అడిగింది స్వప్నసుందరి.

"ఆహా... నిక్షేపంగా... నీ మేనకోడలిని కదా" నవ్వుకు నవ్వే బదులిస్తూ చెప్పింది మాధురి. దారం తెగింది. అయినా ముడివేసి మాల పూర్తిచేసింది. చిక్కు ముడులైనా పూల సొగసులలో కలిసిపోయాయి. అత్తకు, తండ్రికీ నడుమ నున్న చిక్కుముడిని తలచుకుంటోంది మాధురి. కబుర్లు వింటున్న అత్తకు తండ్రిమాట చెప్పిన పుడల్లా కళ్లల్లో మెరుపుకనబడేది.

అన్నా చెల్లెళ్లను కలపాలి. ఎలా?

"అత్తయ్యా! మా డ్యాన్స్ ట్రూప్ అంతా అమెరికా వెళ్తున్నారు"

"గుడ్... వెళ్లిరా" ఆనందంగా అంది స్వప్న సుందరి.

"ఎలా వెళ్తాను? నాన్న ఒప్పుకుంటేగా? ఈ ఛాన్స్ మిస్ చేసుకోకూడదనుకుంటున్నాను. పైగా నువ్వు అరంగేట్రంకు రాలేదు. ఇక నాన్న కెవరు నచ్చచెపుతారు? అంది మాధురి.

నాట్యమే ప్రాణమైన స్వప్నసుందరి మాధురి బాధనర్థం చేసుకుంది. మేనత్తగా తనకు మాధురి నాట్య భవిష్యత్‌పై బాధ్యత ఉందనుకుంది. మేనకోడలికి, తనుకూ ఉన్న నాట్యబంధానికి పంతం దూదిపింజలా తేలిపోయింది.

"నువ్వు సిద్ధంగా ఉండు మాధురీ. మీ నాన్న ఎందుకు వద్దంటాడో నేను చూస్తా. మీ మామయ్యకూడా ఇప్పుడు అమెరికాలోనే ఉన్నాడు. నీకేం భయం లేదు. పద బయలుదేరుదాం" మాధురికి ధైర్యం చెప్తూ కనకాంబరాల మాలను మాధురి జడకు అందంగా చుట్టింది స్వప్నసుందరి.

మేనకోడలి కొరకు మునిపల్లె పొలిమేరలు దాటింది స్వప్నసుందరి. రైలు వేగాన్ని మించి ఆమె మనసు పరుగులు తీస్తోంది. అన్నాచెల్లెళ్లను వీడదీసిన నాట్యమే మళ్లీ కలుపుతోందన్న నిశ్చింతతో మాధురి అత్త ఒడిలో కమ్మని కలలు కంటోంది. ●